www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 జూన్ 2025



వరప్రసాద్‌కు బెస్ట్ టెన్నిస్ కోర్చు అవార్డు

ప్రజాశక్తి - మామిడికుదురు

ఈదరాడకి చెందిన తవిటికి వరప్రసాద్ బెస్ట్ టెన్నిస్ కోచ్ అవార్డు అందుకున్నారు. ఈనెల 22న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్.గవాయ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వరప్రసాద్ సోమవారం తెలిపారు. సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహింస్తూ టెన్నిస్ లో ప్రావీణ్యం సాధించారు. న్యూఢిల్లీలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు టెన్నిస్‌లో కోచింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బెస్ట్ టెన్నిస్ కోచ్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న అతన్ని పలువురు ప్రముఖులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న వరప్రసాద్

కమ్యూనిస్టు పార్టీయే ప్రత్యామ్నాయం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

దేశంలో, రాష్ట్రంలో భూర్జువా పార్టీలకు కమ్యూనిస్టు పార్టీయే ప్రత్యామ్నాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్, సిపిఎం నాయకులు, కవి, రచయిత యాసలపు సూర్యారావు 13వ వర్ధంతి సందర్భంగా పెద్దాపురం వరహాలయ్యపేటలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైసిపికి టిడిపి, టిడిపికి వైసిపి ప్రత్యామ్నాయం కాదని, ఆయా పార్టీలు కార్పొరేట్ శక్తులకు అభివృద్ధి పేరుతో భూములను, ప్రజల సంపదను దోచిపెడుతున్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీ విధానాలతో అభివృద్ధి సాధ్యమని చెప్పారు. భూమి ప్రజల చేతుల్లో ఉండాలని, కార్పొరేట్ల చేతుల్లో కాదని తెలిపారు. కాకినాడ సెజ్‌లో కార్పొరేట్ కంపెనీలకు భూములు ఇచ్చి 18 ఏళ్ల గడుస్తోందని, ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. కులం, మతం, ప్రాంతం అవినీతిలో కూరుకుపోయిన నేటి పెట్టుబడిదారీ రాజకీయాల్లో ప్రజల కోసం నికార్సుగా పని చేసే సూర్యారావు వంటి స్వచ్ఛమైన రాజకీయ నాయకులు ఎంతో అవసరమని అన్నారు. నేటి రాజకీయాల్లో డబ్బు కట్టలతో వంది మాగదులను వేసుకుని వస్తున్నారని, ప్రజలకోసం నీకార్సుగా పని చేసే వారు కనబడడం లేదన్నారు. సూర్యారావు మన మధ్యలో లేకపోయినా ఆయన చేసిన ప్రజా ఉపయోగకర పనులు గుర్తుండిపోతాన్నాయన్నారు. ఆయన లాంటి వారు చాలా అరుదుగా ఉంటారన్నారు. ప్రజా నాయకునిగా, ఆదర్శ కమ్యూనిస్టుగా చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ప్రజల కోసం నిలబడి అరుదైన వ్యక్తుల్లో సూర్యారావు ఒకరన్నారు. ప్రజల కోసం సర్వస్వం అర్పించారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవినీతి చేసిన వారిని పార్టీలోకి తీసుకుని కండువాలు కప్పుతోందని విమర్శించారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఐక్యత చెడగొడుతోందన్నారు. విశ్వ గురువు అని ప్రచారం చేసుకునే మోడీ భారతీయ విద్యార్థులను అమెరికా సంకెళ్లు వేసి పంపితే నోరు ఎందుకు మెదపలేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి దాసోహం అయిపోయాయన్నారు. సంవత్సర కాలంలో మోడీ మూడుసార్లు రాష్ట్ర పర్యటన చేసారని కానీ, రాష్ట్రానికి ఒరిగింది ఏముందని ప్రశ్నించారు. గతంలో మోడీని తిట్టిన ఇదే నాయకులు ఇప్పుడు పొగుడుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ రకమైన రాజకీయాలు రాష్ట్ర ప్రజలకు మంచిది కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం మెగా డిఎస్‌సిపై చేశారని, దాని అమలుకు సంవత్సర కాలం పట్టిందని ఎద్దేవా చేశారు. కార్పొరేట్ సంస్థలకు రెండు మూడు నెల్లోనే భూములను కారు చౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. ఒక పెన్షన్ పథకం మినహా మిగిలిన సూపర్ సిక్స్ పథకాలేవీ అమలు కావడం లేదన్నారు. డబ్బులు లేవని చెబుతున్నారని, జిఎస్‌టిలో మనకు కేంద్రం నుంచి సగం వాటా రావాల్సి ఉన్నా ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రాజధానికి నిధులు, పోలవరం నిర్వాసితుల సమస్యలు, పునరావాసం వంటి అనేక పెండింగ్ అంశాలతో బాటు ఇతర రాష్ట్ర ప్రయోజనాలపై ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు, ఆస్తి పన్ను పెంచారని, ప్రజలకు సేవ చేస్తా అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలపై భారాలు మోపారని తెలిపారు. ప్రజల కోసం సేవ చేయడమే సూర్యారావుకు నిజమైన నివాళి అన్నారు. తొలుత సూర్యారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఎం పెద్దాపురం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.బేబీరాణి, రాజశేఖర్, పలివెల వీరబాబు, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, వీర్రాజు, కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, స్నేహ, అప్పన్న పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సభలో ఆకట్టుకున్న కళారూపాలు

సూర్యారావు వర్ధంతి సందర్భంగా ప్రదర్శించిన కళా రూపాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. తేనెల తేటల మాటలతో కోలాటం, సావిత్రీ బాయ్ పూలే కోలాటం, జై ఎర్రజండా, కందుకూరి వీరేశలింగం రూపకం ప్రదర్శించారు. సిపిఎం ఉద్యమ చరిత్ర జనం కోసం నృత్య రూపకం ప్రదర్శించారు. సిరిపురపు బంగారు రాజు, అనూష, అంజలి, జస్విత, మంతెన సత్తిబాబు, మాగపు నాగు, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, అమృత, నమ్రత, పూజిత, నిహారిక, దీపిక, అఖిల, నిఖిల, సూర్యకళ, లీల పాల్గొన్నారు.



సభలో ఆకట్టుకున్న కళారుపాలు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు పథకాలు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి కోరుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ దగ్గర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేస్తారని అంగన్‌వాడీలందరూ ఆశించారని అన్నారు. కానీ వేతనాలు పెంచకపోగా పని భారాన్ని తీవ్రంగా పెంచి రకరకాల యాప్‌ల పేరుతో ప్రీస్కూల్‌ని అటకెక్కించారని అన్నారు. అలాగే రూ.10వేల రూపాయలు వేతనం దాటింది అనే పేరుతో మొత్తం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌శాడీ వర్కర్స్‌కి నిలుపుదల చేశారని ప్రభుత్వ ఉద్యోగం అని ఆన్లైన్లో చూపిస్తుందని, కాబట్టి మీకు సంక్షేమ పథకాలు రావని సచివాలయాల దగ్గర చెబుతున్నారని అన్నారు. అంగన్‌వాడీ హెల్పర్, మినీ వర్కరు ఏం పాపం చేశారని సంక్షేమ పథకాల అమలు చేయడం లేదని రూ.11,500 తో ఎట్లా బ్రతకాలని ఎంతోమంది ఒంటరి మహిళలు ఈ జీతం మీదే ఆధారపడి బతుకుతుంటే వాళ్ళు కుటుంబం ఎట్లా బతుకుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకి ప్రభుత్వ ఉద్యోగులు అని చెప్పి సంక్షేమ పథకాల అమలు చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఆన్లైన్లో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించి సంక్షేమ పథకాల అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంతే కాకుండా వాళ్లకు పనిచేయని సెల్ ఫోన్ లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్ తీయకపోతే వాళ్లకి ఇచ్చే ఫీడింగ్ కూడా నిలుపుదల చేస్తామని చెప్పి ప్రభుత్వం చెబుతోందని, లబ్ధిదారులు పదేపదే అంగన్‌వాడీ సెంటర్ చుట్టూ తిరగవలసి వస్తుందన్నారు. ఇది సరైనది కాదని ఈరోజు అంగన్వాడీలో లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని వర్కర్, హెల్పర్ పని మినీ వర్కర్లు చేస్తుంటే అనారోగ్య పాలవుతున్నారని కాబట్టి మినీ సెంటర్ ని మెయిన్ సెంటర్‌గా మార్చి హెల్పర్ పోస్టు భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేస్తారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి .వెంకటలక్ష్మి మాట్లాడుతూ రెండు నెలలుగా అంగన్వాడీలకు వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరైన టైంలో బిల్లు పెట్టకపోవడమే దీనికి కారణం అని అధికారులు చెబుతున్నారని, ఎందుకు ఈ జిల్లా ఐసిడిఎస్ అధికారులు 20వ తేదీలోపు బిల్లు పెట్టకపోవడం దారుణమని తక్షణమే వేతనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఎన్.బలరాం మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పి.అమూల్య, కె.విజయలక్ష్మి, పి.రత్నకుమారి, జయలక్ష్మి, మహేశ్వరి, సుజాత, బి.వెంకటలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, పార్వతి, జ్యోతి, వజ్రం తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

మాజీ మంత్రి వెంకటరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - ఆలమూరు

ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి 11వ వర్ధంతిని పూర్వ ఆలమూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సోమవారం నిర్వహించారు. మండలంలోని పినపళ్ల గ్రామం ను చెట్టు సెంటర్, కొత్తూరు జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న మాజీ మంత్రి సంగిత విగ్రహానికి ఆయన కుమారుడు, సంగిత గంగరాజు, గ్రామ సర్పంచ్ సంగీత సుభాష్ ఆధ్వర్యంలో అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లో జరిగిన వెంకటరెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో పెదబాబు, సుభాష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, జిల్లా పిఎంపి అధ్యక్షులు గంగుమళ్ల రాంబాబు, నాయకులు యేడూరి వీరబాబు, యనమదల శ్రీనివాస్, నామాల సుబ్బారావు, వంగా శ్రీనివాసరావు, యర్రంశెట్టి రాము, తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** అంగర లో మాజీ మంత్రి వెంకటరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంగిత వెంకట్ రెడ్డి మనవడు, పినపళ్ల గ్రామ సర్పంచ్ సంగీత సుభాష్, జడ్‌పిటిసి సభ్యులు పుట్టపూడి అబ్బు, పలువురు నాయకులు. పాల్గొని మాట్లాడారు. వెంకట రెడ్డి జ్ఞాపకార్థం గ్రామంలో పేదలకు దుస్తులు, పండ్లు, అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ వాసా కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ స్వామికాపు, మాజీ ఉప సర్పంచ్ మచ్చ గంగరాజు తదితరులు, పాల్గొన్నారు.



పినపళ్లలో నివాళులర్పిస్తున్న వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఆర్‌డిఒ డి.అఖిలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో మౌలిక వసతులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనా, పాత, కొత్త ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.8 వేల కోట్ల మేర పెండింగ్ లో ఉండటం, స్కాలర్‌షిప్‌లు జాప్యం కావడం వల్ల లక్షల మంది విద్యార్థులు ఒత్తిడికి గురవుతారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ పటిష్ఠంగా కొనసాగాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు కె.నవీన్, సురేష్, ఎస్.సందీప్, కళ్యాణ్, పివై ఎల్ నాయకులు భీమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- మామిడికుదురు

మగటపల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగంపై గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు మగటపల్లి పంచాయతీ పరిధిలో2021-2024 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే వసూలు చేసిన పన్నులలో లోపాలు ఉన్నాయని వీటిపై కూడా విచారణ నిర్వహించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నామన నాగేశ్వరరావు, అడబాల వెంకటేశ్వరరావు. తదితరులు ఉన్నారు.

కార్టూ'నిజం'



సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆలమూరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పిహెచిసి వైద్యాధికారులు డాక్టర్ డి.సాయి కిషోర్, డాక్టర్ ఎన్.లక్ష్మీ స్నేహ, డాక్టర్ బి.అనంత రామకష్ణ అన్నారు. మండలంలోని పెదపల్ల, చొప్పెల్ల పిహెచ్‌సిల్లో వారి ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు. ముందుగా అతిసార, మలేరియా, డెంగు వంటి వ్యాధులను గుర్తించే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తో వ్యాధులు నివారించవచ్చని అవగాహన కల్పిస్తూ ట్రీట్మెంట్ చేయాలని వారన్నారు. ముఖ్యంగా పై వ్యాధులు చోకడానికి ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉండే బాలలకు, వద్ధులకు, బాలింతలకు, గర్భిణులకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని సిబ్బందికి పలు హెచ్చరికలు జారీ చేశారు. నివారణకు శరీర, పరిసరాల శుభ్రతతో పాటు విటమిన్ ఎ, ఒఆర్ఎస్, స్వచ్ఛమైన తాగునీరు, తల్లిపాలు వంటి వాటితో నివారించవచ్చు అన్నారు. ఏదైనా వ్యాధి సోకిన వెంటనే వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించాలన్నారు. వాటి నిర్మూలన దిశగా పురోగతిని సాధించడానికి అందరూ కృషి చేయాలన్నారు. అందుకే మన సేవలతో వ్యాధులు రహిత సమాజానికి కలిసికట్టుగా పాటు పడదామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు బి.సూర్యనారాయణ, రాజా అక్కుల, సిహెచ్ఒ ఎంఎస్ఎన్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ హెచ్.వెంకటేశ్వరరావు, ఎంపిహెచ్ఎస్ లు శివ ప్రసాద్, మణి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



చొప్పెల్ల పిహెచ్‌సిలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు ఎనిమిదేళ్ల పాటు విశిష్ట సేవలందించి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ప్రక్కి వీర బ్రహ్మానందం, నండూరి భీమరాజు సోషల్ ఉపాధ్యాయులు కాకినాడ రమేష్, హిందీ ఉపాధ్యాయులు అయ్యంగారి లక్ష్మి గణిత ఉపాధ్యాయులు మూర్తిలను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి అలజంగి నాగరాజు మాట్లాడుతూ, ఈ ఉపాధ్యాయుల కృషితోనే పాఠశాల శ్రేణుల్లో ముందంజలో నిలుస్తోందని ప్రశంసించారు. అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిష్టాత్మక స్థానంలో నిలవడానికీ, ఈ ఉపాధ్యాయుల కృషి ఎంతో ముఖ్యమైందన్నారు. జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మీరు ఈ పాఠశాలలో వేసిన ఆదర్శ బాటలు, తరువాతి తరానికి ప్రేరణగా నిలుస్తాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పితాని శ్రీనివాస్, వి.శ్రీధర్, సుమతి, లల్లి బేబీ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో హెచ్ఎం తదితరులు

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎన్నో ఏళ్లుగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ ఇంజనీరింగ్ విభాగం(ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అనుబంధ సంస్థ సిఐటియు పిలుపు మేరకు నగర పంచాయతి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్టా శివ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. శివ ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులందరికీ జిఒ.నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని, 5 ఏళ్ల సర్వీస్ పూర్తయిన మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, విరమణ వయస్సును పెంచాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ, తమకు న్యాయం చేయాలని తహసిల్దార్ కార్యాలయం ఎదుట వ్యూయ్ వాంట్ జస్టిస్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.అనంతరం తహసిల్దార్ సుభాష్ కు ఇంజనీరింగ్ కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాసరావు, ఎన్ అరుణ్ కుమార్, వి వెంకటేశ్వర రావు,ఎస్ అజయ్ కుమార్, జి రమేష్,కె గోవింద రాజు, వి ప్రసాద్, కె వెంకట శివ,కె శరత్, జి ప్రదీప్,జి వెంకటేశ్వర రావు, సిహెచ్ వెంకటేశ్వర రావు, ఎస్ రామరాజు,కె శ్రీనివాసురావు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది

25న కొత్తపేటలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట పరిధిలో కాపు కళ్యాణ మండపంలో ఎంఎల్ఎ బండారు సత్యానంద రావు ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ వారు మెగా జాబ్ మేళాను జూన్ 25వన ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధికారి డి.హరిశేషు తెలిపారు. జిల్లా అధికారి మాట్లాడుతూ కొత్తపేట ప్రాంత చుట్టుపక్కల నిరుద్యోగ యువతి, యువకులు పరిశ్రమలు సేవా రంగాల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ యొక్క జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 11 కంపెనీలకు సంబంధించిన సుమారు 400 ఖాళీలు భర్తీ చేయడానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎస్ఎస్‌సి, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాలిటెక్నిక్, బిటెక్, ఎంబిఎ, ఎంఎస్‌సి కెమిస్ట్రీ చదివిన యువతి యువకులు ఈ జాబ్ మేళాకు హాజరకావచ్చున్నారు. వివరాలకు జోత్స్న స్కిల్ హబ్ కోఆర్డినేటర్ 9190008 31156, రాజేంద్ర ప్రసాద్ ప్లేస్మెంట్ ఆఫీసర్ 9704414258, కంఠంశెట్టి శ్రీనివాసరావు 9849732777 సంప్రదించవచ్చు.

వైసిపి ఆధ్వర్యంలో యువత పోరు



అమలాపురంలో డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -అమలాపురం

వైసిపి పార్టీ ఆధ్వర్యంలో యువత పోరు పేరుతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వృత్తి శిక్షణ నైపుణ్యాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు యువజన విభాగం నాయకులు విద్యార్థి సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నాయకులు డిఆర్ఒ రాజకుమార్ కి వినతిపత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయెల్, నియోజకవర్గ వైసిపి కో ఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు, గొల్లపల్లి సూర్యారావు, పిల్లి సూర్యప్రకాశ్, పితాని బాలకృష్ణ, జడ్‌పిటిసి సభ్యులు గెడ్డం సంపద రావు, పందిరి శ్రీహరి, కొనుకు బాబుజి, ఎంపిపిలు ఇళ్లశేషా రావు, కుడుపూడి భాగ్యలక్ష్మి, గౌతమి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం నుంచి అమలాపురం పోరుబాట ర్యాలీ

అంబాజీపేట: వైసిపి కేంద్ర కార్యాలయం ఆదేశాలు మేరకు సోమవారంకలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే యువత పోరు నిరసన కార్యక్రమానికి పి.గన్నవరం నుంచి బయలుదేరి అంబాజీపేట గంగలకుర్రు మలుపు వద్ద నియోజవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. మండల శాఖ అధ్యక్షులు విత్తనాలు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నియోజవర్గ వైసిపి శ్రేణులు ర్యాలీగా తరలి వెళ్లారు. కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలని నిరుద్యోగ భతి, ఫీజు రీయిబర్స్మెంట్ అమలు చేయాలన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు, అభిమానులు నినాదాలు చేస్తూ అమలాపురం ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు బొమ్మి ఇజ్రాయెల్, కుడిపూడి సూర్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి, ఎంపిపి డి.వెంకటేశ్వరరావు, దేవి బూడిద వరలక్ష్మి, పి.గన్నవరం మండల అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి దుర్గారావు, నియోజకవర్గ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబాజీపేటలో పోరుబాట ర్యాలీ ప్రారంభిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాస్

సింగయ్య మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

ప్రజాశక్తి - రావులపాలెం

మాజీ సిఎం వైఎస్.జగన్ పర్యటనలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందడానికి సరైన రక్షణ ఇవ్వలేకపోయిన రాష్ట్ర ప్రభుత్వమే కారణం అని వైసిపి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. రావులపాలెం వైసిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్తుంటే రోప్ పార్టీని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. జగన్‌కు సరైన భద్రత కల్పించకుండా ఆయనను హతమార్చాలని ఈ కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జగన్ ప్రజల్లోకి వెళ్ళకుండా అడ్డుకోవడం కోసం అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం 48 రోజులు దాటినా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటికీ రూ.248 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. అనంతరం వైసిపి చేపట్టిన యువత పోరు కార్యక్రమంలో భాగంగా అమలాపురం కలెక్టరేట్ కు ర్యాలీగా జగ్గిరెడ్డి బయలుదేరి వెళ్లారు.



మాట్లాడుతున్న చిర్ల జగ్గిరెడ్డి

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం భీమేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్న దానానికి విజయవాడకు చెందిన నాగులపల్లి శ్రీనివాస్, పల్లవి దంపతులు రూ.5 లక్షలు విరాళంగా సోమ వారం అందజేశారు. ఈ మొత్తం ధారా జయ రామకష్ణ శాస్త్రి చేతుల మీదుగా ఆలయ సహాయ కమిషనర్ కార్య నిర్వాహణాధికారి అల్లు వెంకట దుర్గా భవానీకి అందజేశారు. విరాళం అందజేసిన దాతలకు కతజ్ఞతలు తెలిపి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



చెక్కు ఇఒకు అందజేస్తున్న దాత

వెంకట్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - అంబాజీపేట

పిఆర్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియం కాకినాడలో ఈ నెల 22వ తేదీన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేటకు చెందిన ప్రముఖ సామాజిక సహజకవి, కవి రత్న వెంకట్ పొలమూరిని ఘనంగా సత్కరించారు. ఎపి భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంలో శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో సిఇఒ డా.కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో కవి సమ్మేళనం జరిగింది. 'సెల్ ఫోనులో సొల్లు కొట్టకు' అనే అంశంపై కవితా గానం చేసినందుకు పొలమూరి వెంకటర్‌ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కమిటీ టి.పార్ధసారథి, జి.ఈశ్వరీ భూషణం, చిట్టె లలిత, భూషణ సుమ శ్రీ,తదితరులు పాల్గొన్నారు. కవి పొలమూరి వెంకట్‌కు సోమవారం పలువురు అభిమానులు, పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

నిత్య పెళ్లి కూతురుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - అమలాపురం

పలు పెళ్లిళ్ళు చేసుకున్న నిత్య పెళ్లి కూతురిపై ఎస్‌పి కృష్ణారావుకు సోమవారం బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం గ్రామానికి చెందిన బేతి వీర దుర్గ నీలిమ, ఆమె తల్లి బేతి వీరలక్ష్మి వారి సోదరులు రామకృష్ణ, కల్యాణ్ ఆర్థిక స్థితిమంతులైన విడాకులను తీసుకున్న పురుషులను టార్గెట్‌గా చేసుకుని మోసం చేస్తున్నారని వారు తెలిపారు. మాయ మాటలు చెప్పి అందినకాడికి డబ్బు దోచుకుంటారని తెలిపారు. సోమవారం నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరు పట్టణాలకు చెందిన ముగ్గురు బాధితులు ఎస్‌పి కృష్ణారావును కలిసి ఫిర్యాదు చేశారు. ఆమె కాజేసిన సొమ్ము తిరిగి ఇప్పించాలని బాధితులు వేడుకున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రూ.32,260 నగదును స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

పోగొట్టుకున్న బంగారు గొలుసును సిసి కెమెరా ఆధారంగా తెలుసుకుని బాధితురాలికి ఆ గొలుసును పోలీసులు అందజేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి. విశాఖపట్టణంలోని జగదాంబ సెంటర్ ప్రాంతానికి చెందిన కటకపల్లి నారాయణమ్మ కాకినాడలో బంధువుల ఇంటిలో శుభకార్యం నిమిత్తం ఆదివారం రైలులో సామర్లకోట వచ్చారు. బయటకు వచ్చే క్రమంలో బంగారు గొలుసుతో ఉన్న పర్సును పోగొట్టుకున్నారు. కాకినాడకు బస్సు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆమె పర్సు లేకపోవడంతో గుర్తించి స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ గరగారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్టేషన్ సెంటర్‌లోని సిసి టివి ఫుటేజీలను పరిశీలించి పర్స్ కాజేసింది ఒక సాధువుగా గుర్తించారు. సాధువు కోసం రాత్రి 8 గంటల వరకు కాపు కాసి పోలీసులు అతనిని పట్టుకుని బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి డి.శ్రీహరిరాజు చేతులమీదుగా సోమవారం బాధితురాలికి బంగారు గొలుసును అందజేశారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ గరగారావులను డిఎస్‌పి అభినందించారు.

దోపిడీ దొంగలకు జైలు శిక్ష

ప్రజాశక్తి - ఏలేశ్వరం

దారి దోపిడీలకు పాల్పడిన ఇద్దరు నేరస్తులకు రెండేళ్ల జైలు శిక్షతోపాటు, రూ.10 వేలు జరిమానాను న్యాయస్థానం విధించిందని ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు తెలిపారు. ఏలేశ్వరం జాతీయ రహదారిపై 2022 సెప్టెంబర్ 15వ తేదీ రాత్రి ఆటోను అడ్డగించి యజమాని మిత్రా గణేష్ నుంచి నగదును దోచుకుపోయిన కేసులో ప్రత్తిపాడు న్యాయమూర్తి లంక రిషిత ఈ తీర్పు చెప్పారన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న రాజమహేంద్రవరానికి చెందిన రేగుల వినోద్, గుజ్జల రామకృష్ణలను నేరస్తులుగా పరిగణించి శిక్షలు విధించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఎపిపి పుప్పాల రవీంద్ర వాదించగా, అప్పటి ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని తెలిపారు.

పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలని జెఎన్‌టియుకె ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ఎస్.ఎన్.చక్రవర్తి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పిజి కళాశాలలో గణితం, గణన ఆవిష్కరణలపై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకున్నప్పుడు మరిన్ని అంశాలను తెలుసుకుంటారని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలని తెలిపారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ విభాగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, విద్యార్థులకు అవసరమైన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ పరిశోధనా వికాసానికి, భావ వినిమయానికి, నూతన ప్రాజెక్టులు రూపొందించడానికి నిర్వహించడానికి యువతకు సదస్సులు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కెవిఎస్.రామచంద్రమూర్తి మాట్లాడారు. ఈ సదస్సును నిర్వహించిన వారిని ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వివిఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపల్ సి.సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

జెవివి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక లయన్స్ కల్యాణ మండపం ఆవరణలో సోమవారం జన విజ్ఞాన వేదిక 37 ఏళ్లపూర్తి చేసుకున్న సందర్భంగా గోడ పత్రికను జెవివి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని, దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడంతోపాటు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు వడిశెట్టి సత్యనారాయణ, ఎన్.సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, వి.సూర్యనారాయణ, వలవల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలువురికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్‌లోని సాయి సేవా మందిరంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి క్యాంపు మేనేజర్ డాక్టర్ చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో శస్త్రచికిత్సకు 35 మందిని ఎంపిక చేశారు. అలాగే కళ్లజోళ్లకు 30 మందిని ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం బివి.శరీం, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు




అమలాపురం కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఓ

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి అధికారు లకు సూచించారు. సోమ వారం స్థానిక కలెక్టరే ట్లోని గోదావరి భవన్ నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో సుమారు 242 అర్జీలు వివిధ సమస్యల పై అర్జీదారుల నుంచి డిఆర్ఒ రాజకుమారి, ఎఒ కాశీ విశ్వేశ్వర రావు, సర్వే ఎడి కె.ప్రభాకర్, డిఎండిఒ రాజేశ్వరరావు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. పిజిఆర్ఎస్ లో నమోదవుతున్న అర్జీలకు నిర్ణీత గడువులో గా పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ పెండింగ్ ఉండరాదన్నారు. అర్జీ దారుల సమస్యను అధికారులు ఓపిగ్గా విని పరిష్కార మార్గాన్ని తెలపాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని అర్జీదారులలో కలిగించాలన్నారు. అర్హతను పరిశించాలని, అనర్హత ఉంటే తగిన కారణాలను అర్జీదారునికి వివరించాలన్నారు. పరిష్కారమైన అర్జీదారుల తో ఐవిఆర్ఎస్ ద్వారా ఉన్నతాధికారులు వారి సంతృప్తి స్థాయిని తెలుసుకోవడం జరుగు తుందన్నారు. ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను అవసరమైతే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి లో స్వయంగా వెళ్లి పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదా రుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరి పరిష్కారం ఉండాలన్నారు. గడువు లోగా పరిష్కరించాల్సిన అర్జీలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు స్వీకరించిన అర్జీ మరల ఓపెన్ కాకుండా సకా లంలో పూర్తిగా విచారించి నిబంధనలకు లోబడి తగు పరిష్కార మార్గాలు పూర్తిస్థాయిలో నాణ్యత తో చూపి రీ ఓపెన్ కు ఆస్కారం లేకుండా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతి ష్టాత్మకంగా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహి స్తూ ప్రతివారం ముఖ్యమంత్రి పిజిఆర్ ఎస్ అర్జీల పరిష్కార సరళిపై సమీక్షించడం జరుగుతుందన్నారు. అధికారులు పిజిఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో సమస్యలకు తగు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఎల్‌డిఎం.కేశవ వర్మ, వివిధ శాఖలకు చెందిన అధి కారులు సిబ్బంది పాల్గొన్నారు.

మీకోసం కార్యక్రమానికి 9 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న రామచంద్రపురం ఆర్‌డిఓ

రామచంద్రపురం: రెవెన్యూ డివిజనల్ అధికారి డి.అఖిల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చాయని ఆర్‌డిఓ. కార్యాలయ అధికారులు తెలిపారు. వాటిలో, 02- తల్లికి వందనం ఇప్పించవలసినదిగా, 02 రీ- సర్వే నందు భూమి తక్కువగా చూపించుచున్నారని, 01 వ్యవసాయ భూమిలోని మురుగు నీరుపెళ్లకుండా చూడవలసినదిగా, 01- పంచాయతీ వారికి కట్టిన డిపాజిట్ అమౌంట్ ఇప్పించవలసినదిగా, 01- రైతులకు దారి మార్గము ఏర్పాటుచేయవలసినదిగా, 01- విద్యా హక్కు చట్టం అమలు చేయవలసినదిగా, 01- సర్వే చేసి హద్దులు చూపించవలసినదిగా దరఖాస్తు చేసుకున్నట్లువివరించారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు



గొడుగులు అందుకున్న విద్యార్థులతో సర్పంచ్

మండలంలోని గుమ్మిలేరు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు గొడుగులు పంపిణీ చేశారు. సుమారు 60 మంది విద్యార్థులకు ఆయన సొంత నిధులతో ఈ గొడుగులను ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు. వర్షాకాల సమయంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంటి నుండి బడికి వచ్చే సమయంలో వీలుగా ఈ గొడుగులు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా

కందులపాలెం పంచాయతీలో అవినీతిపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కందులపాలెం గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని పిడిఎస్‌యు, ఐఎఫ్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. కొబ్బరి చెట్ల ధరావతుదారునికి రూ. 45 వేల సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని- ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ఆర్‌డిఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా కార్యదర్శి దీక్షల వెంకటేశ్వరరావు, వెంబలి భీమశంకరం మాట్లాడుతూ మండలంలోని కందులపాలెం గ్రామపంచాయతీలో గత ఏడాది కొబ్బరి చెట్టు ఫలసాయం వేలం సందర్భంగా స్థానికుడు దీక్షల గోవిందరావు పంచాయతీలో రూ.45 వేలు ధరావత్తు చెల్లించి. నేటికీ సంవత్సరం కావస్తున్నా ధరావత్తు సొమ్మును తిరిగి గోవిందరావుకి చెల్లించలేదన్నారు. వేలం పాట నిబంధన ప్రకారం వేలంలో పాల్గొన్న వ్యక్తి పాట దక్కకపోతే పంచాయతీ తిరిగి ఆ ధరావత్తు దారుడికి ఇచ్చేయాలి కాని కందులపాలెం గ్రామపంచాయతీ ప్రెసిడెంట్, కార్యదర్శులు ధరావత్తు సొమ్మును తమ జేబులో వేసుకున్నారని ఆరోపించారు. పాట దక్కని గోవిందరావు పదేపదే తమ సొమ్ము వెనక్కి ఇవ్వాలని సంవత్సరం కాలంగా గ్రామపంచాయతీ చుట్టూ తిరిగాడని, రేపు,మాపు అంటూ కాలం గడుపుతూ వచ్చి తనకు నేటి వరకు ధరావత్తు సొమ్ము ఇవ్వలేదని అన్నారు. గోవింద్ రావు అప్పు చేసి ధరావత్తు చెల్లిస్తే ఆ డబ్బుకు వడ్డీ మీద వడ్డీ అయిందన్నారు. బాధితుడు గోవిందరావు రామచంద్రపురం ఆర్‌డిఓను కలిసి తమ గోడును వెళ్లబుచ్చి న్యాయం చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, ఆయనకు రావలసిన ధరావత్తు సొమ్ము రూ.45,000 వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అధికారి అఖిల ప్రియకి అందించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, తదికి లక్ష్మణ్, కోట ముత్యాలు, కొప్పిశెట్టి మోహన్, గుబ్బల చిట్టయ్య, గంగా సుబ్రహ్మణ్యం, రావి వెంకట్రావు, రావి భాను, దీక్షల లక్ష్మి, గుబ్బల చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

48వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 48వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో సంఘం అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 48 రోజులుగా ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. తమ సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, సుంకర సత్తిరాజు, డి.రాజు, పి. శ్రీను, ఎం.భద్రరావు, బి.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, మాపాటిన పాపారావు, అయ్యప్ప స్వామి, టి.సాయి, ఎస్‌కె.బషీర్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన

- గ్రామ సర్వేయర్ల సమావేశం
- తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు

దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్వేయర్లు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలియజేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ సర్వేయర్ల సమావేశం జరిగింది. ఈసందర్భంగా గత బడ్జెట్ నుంచి గ్రామసర్వేయర్లకు అనేక విధాలుగా సేవలందిస్తున్న గ్రామ సర్వేయర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని వ్యాఖ్యానించారు. అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న తమను సొంత మండలాలకు సంబంధం లేకుండా బదిలీలు జరపడం సరికాదన్నారు. గ్రామ సచివాలయ సర్వేయర్లందరికి పదోన్నతులు కల్పించి రెవెన్యూశాఖలో విలీనం చేసి రెగ్యులర్ స్కేల్‌ను వర్తింప చేసి అప్పుడే బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ జనాభా ప్రాతిపదికన కాకుండా భూమి విస్తీర్ణం బట్టి హేతుబద్ధీకరణ చేయాలన్నారు. మహిళ ఉద్యోగుల సమ్మతి మేరకు ఇతర శాఖలకు బదిలీ చేసే అవకాశాలు మంజూరు చేయాలని తీర్మానించుకున్నారు. అనంతరం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ కె.జె.ప్రకాష్‌బాబుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మీరు ఎదుర్కొంటున్న సమస్యలను శాఖాపరంగా పరిష్కరించుకోవాలే తప్ప నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపడం సరికాదని తహశీల్దార్ ప్రకాష్‌బాబు హితవు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్ల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె చేపట్టి విధులను బహిష్కరిస్తామని మండల సర్వేయర్ సమాఖ్య తెలిపింది. రాష్ట్ర గ్రామ సర్వేయర్ల పిలుపు మేరకు ప్రస్తుతం నల్ల బ్యాడ్జీలను ధరించి విధులు నిర్వహిస్తున్నామన్నారు. డిమాండ్లకు అనుగుణంగా బదిలీలు చేపట్టకుంటే ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేకు సహాయ నిరాకరణ చేసి పూర్తిస్థాయిలో విధులు బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ బి.అప్పాజీ, సూపరింటెండెంట్ ఎం.మెహర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల డిఎంహెచ్ఓ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమకు వర్తింప చేయాలంటూ ఆశా కార్యకర్తలు డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని ముట్టడించారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ ముట్టడి కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జీ మాట్లాడారు. ఎన్నికల ముందు చిరుద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి, నేడు అధికారంలోకి వచ్చాక చంద్రబాబునాయుడు మాట తప్పారని అన్నారు. ఆశా కార్యకర్తలకు తల్లికి వందనం, కుటుంబంలో వృద్ధులకు వృద్ధాప్య, వికలాంగ పెన్షన్, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకి గర్భిణీ నమోదు టార్గెట్ పెట్టరాదని, టార్గెట్ల పేరుతో వేతనాలు వేయమంటూ అధికారులు చేస్తున్న వేధింపులు ఆపాలని, టిబి, లెప్రసీ, ఎన్‌సిడి లాంటి ఆన్‌లైన్ లింకులతో సర్వేలు, ఫీవర్ సర్వేలు ఆపాలని, ప్రభుత్వం సరఫరా చేసిన ఫోన్లు మార్చి కొత్తఫోన్లు ఇవ్వాలని, ఆన్‌లైన్ రికార్డులు నమోదు, రిపోర్టులు ఆపాలని, ఆశాల చేత చేయిస్తున్న అదనపు పనికి అదనపు వేతనం చెల్లించాలని, ప్రతీ నెల జిల్లా అధికారులతో జాయింట్ మీటింగ్ పెట్టి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సంక్షేమ పథకాలు అమలుకు ఆటంకంగా ఉన్న సిఎఫ్ఎంఎస్ నమోదును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మార్పు చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ధర్నా చేసిన ప్రదేశానికి అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం మినహా ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పద్మ, జిల్లా కోశాధికారి నొక్కు లలిత, రాయుడు నాగలక్ష్మి, ఎం.బేబీ, ఎం.లక్ష్మి, సిహెచ్.వెంకటలక్ష్మి, ఎల్.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో రేకుల షెడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కొండెవరం జడ్‌పి ప్రాథమిక పాఠశాలలో సైకిల్ పార్కింగ్ కోసం రేకుల షెడ్డును నిర్మించారు. జనసేన నాయకులు గాది కొండబాబు, గోపి, బర్రె బుజ్జి, ఎస్ఎంసి ఛైర్మన్ వేమగిరి రాంబాబు, ఉపాధ్యాయులు సహకారంతో ఈ షెడ్డు నిర్మించినట్లు స్థానికులు సూరిబాబు, వెలుగుల అప్పలరాజు తెలిపారు. షెడ్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

సర్కిల్ పరిధిలోని స్కూల్స్, కాలేజీ గ్రౌండ్‌లోకి బయట వ్యక్తులు ప్రవేశించిన, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని కాట్రావులపల్లి స్కూల్ గ్రౌండ్‌లో కొందరు యువకులు అనుచితంగా తిరుగుతున్నారని గుర్తించి వారి తల్లిదండ్రులను, బంధువులను సోమవారం సర్కిల్ కార్యాలయానికి పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టుకోవాలని, వేళ కాని వేళలో ఇంటి నుంచి బయటకు పంపించకూడదని వారికి సూచించారు. బయట వ్యక్తులు స్కూల్స్, కళాశాలల్లోకి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలు చోట్ల ఒలింపిక్ డే రన్



ముక్తేశ్వరంలో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - యంత్రాంగం

పలు చోట్ల ఒలింపిక్ డే రన్ సోమవారం నిర్వహించారు.

ఐనవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఒలింపిక్ రన్ నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి పెచ్చెట్టి శ్రీనివాస్ జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎంఎ.రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రమేష్, సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని జడ్‌పి హైస్కూల్ శివల నుంచి ఒలింపిక్ రన్ ప్రారంభించారు. ప్రధాన ఉపాధ్యాయులు టి.కృపావేణి, ఎంఇఒ అంజనీ, నాగరాజు, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఇల్లా లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు బలుసు శివ ప్రసాద్, శివల ఉపాధ్యాయులు, కె. మండలం ఫిజికల్ డైరెక్టర్ అన్నపూర్ణ, కామేశ్వర, దేవి, దుర్గ, సురేష్, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలమూరు: కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఐ.అప్పాజీ, మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ టి.అబ్బులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని హైస్కూల్ ఆవరణ నుండి కొత్తూరు సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పి.సత్యనారాయణ, సిహెచ్ రాధాకృష్ణ, వాకా రాజు, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జి. కనకదుర్గ అధ్యక్షతన మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిఎస్‌ఓ కళాశాల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఘనంగా ఒలింపిక్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఒలింపిక్ రన్‌ను ఎంపిటిసి సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి ఒలింపిక్ రన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఎస్ఎంసి ఛైర్మన్ వాసా సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు అగరెల నానాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు దీక్షల ఏసుబాబు, మాజీ సర్పంచ్ గుత్తా సుభాష్ చంద్రబోస్, ఆదినాల చంద్రరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లిలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్